

తెలుగు సినిమా పరిశ్రమ

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

అసలే మనది పారిశ్రాకంగా వెనకపడివున్న దేశం. అందులో ప్రత్యేకించి మన తెలుగుగడ్డ మరీ అధోగతిలో పడిఉన్నది. పరిశ్రమలు స్థాపితమై విస్తరించే సమయంలో వాటి విస్తరణను అరికట్టడానికి పెట్టుబడిదార్లు ఎట్లాగూ రకరకాల యుక్తులు పన్నుతారు; కాని పరిశ్రమలు స్థాపితమయేవరకూ వాటి సక్రమ స్థాపనకుగాను ఆందోళన చెయ్యటం ప్రజల విధి. సక్రమంగా స్థాపించబడిన పారిశ్రామిక సంస్థలు సంపదను సృష్టిచేసి దేశానికి స్థూలంగా ఉపకరించడమేకాక కొంతమందికి జీవనోపాధులు కల్పించి ఆర్థికంగా ఉపకరించుతై.

తెలుగువాళ్ళకు చెప్పుకోదగ్గ పరిశ్రమలు లేవు. అయితే ఇతర పరిశ్రమలుంటే వున్నవని చెప్పుకోవచ్చు. లేకపోతే లేవని చెప్పుకోవచ్చు. ఉండీ లేనట్టున్న పరిశ్రమ తెలుగు సినిమాపరిశ్రమ. సైనికుల గుడారాలవతుగా ఇది పునాదిలేకుండానూ, నిలకడలేకుండానూ ఉన్నది. 1930 నుంచీ తెలుగు సినిమా చిత్రపరిశ్రమ జరుగుతూనే ఉన్నది, కాని ఈ పరిశ్రమకు చెందిన సంస్థలు, చెప్పుకోదగ్గవి, లేవు.

పారిశ్రామిక సంస్థకు వుండదగ్గ లక్షణాలేవో మనం సులభంగా నిర్వచించుకోవచ్చు. పారిశ్రామిక సంస్థ అన్నది నిలకడగా పరిశ్రమసాగిస్తూ అందులో పనిచేసే వారికి నెలకు పాతికరోజులూ, ఏడాదికి పన్నెండు నెలలూ వ్యాపకం ఇచ్చి జీవనోపాధి కల్పించాలి; పరిశ్రమ తాలూకు వ్యాపారపు ఒడుదుడుకుల మూలంగా సంస్థకు శాశ్వతమైన విఘ్నాలు రాకూడదు; కాలం గడిచినకొద్దీ, పరిశ్రమ ఫలితాలకి బయట చలామణీ హెచ్చినకొద్దీ, సంస్థ అభివృద్ధిచెంది విస్తరించాలి.

ఈ లక్షణాలు కలిగిన తెలుగు చిత్రనిర్మాణ సంస్థ నేటివరకూలేదు. మీర్జాపురం రాజావారి స్టూడియో మినహాయిస్తే తెలుగువారికి స్టూడియోలేదు. నెల జీతాలమీద ప్రొడ్యూసర్లనూ, డైరెక్టర్లనూ, నటీ నటులనూ, కథకులనూ, కవులనూ, సంగీత, చిత్ర కళాదర్శకులనూ పెట్టుకొని, ఒక చిత్రంమీద పెట్టిన డబ్బు తిరిగిరాక పూర్వమే మరో చిత్రం ప్రారంభించగల సినిమా కంపెనీ తెలుగు దేశంలో లేదు.

ఒక సుప్రసిద్ధ సినిమా ప్రొడ్యూసరు-డైరెక్టరు చెప్పినట్టు సినిమా చిత్రాలు తీయడం జూదంగా వుంది. తీసే చిత్రంమీద లాభం వచ్చినా నష్టంవచ్చినా కూడా పెట్టుబడిదారు మరి కనిపించడు. తను ఒక సంస్థ నిర్మించబోతున్నాడన్న విచారంలేదు గనక ప్రస్తుతానికి ఎంత డబ్బయినా పోసి అవసరమైన మనుష్యులను తెచ్చుకుంటాడు, తనపని గడుపుకుంటాడు, దాటిపోతాడు. ఇతను అందరి రేట్లూ పెంచడంవల్ల బాధపడేది ఇతనుకాదు. ఇతని తరవాత వచ్చేవాడు.

ఈ జూదబుద్ధికి ఫలిత మేమంటే మనకీనాడు ఛాయాచిత్రగ్రహణంలోనూ, శబ్దగ్రహణంలోనూ నిపుణులైన వారు తగినంతమంది లేరు. సినిమా అనేక కళల కేంద్రీకరణంవల్లగాని సాధ్యంకాదు. ఈ కళలలోనూ విద్యల

http://www.maganti.org/

లోనూ దక్షతగడించేవారు సంస్థల అండలేక రారు. అదీ కాక ఈ జూదపు వాతావరణంలో సంస్థలను నిర్మించగల పట్టుదల గల వారికికూడా ఊపిరిసలపడంలేదు. సమర్థుడైన ప్రొడ్యూసరు పైకితెచ్చే తారలను జూదగాళ్లు మూడింతల జీతం ఇచ్చి ఎగరగొట్టుకు పోతారు. తుక్కు చిత్రాల నిర్మాణం పెరిగిపోతుంది. మంచి చిత్రాల ఆయుర్దాయం క్షీణించిపోతుంది. తారల ఆదాయం పెరిగినంతగా వారి ప్రతిభ క్రమాభివృద్ధి చెందదు. చిత్రనిర్మాణకౌశలం ఒక్క అడుగు ముందుకు వెళ్ళక స్తంభించిపోతుంది.

చిత్రనిర్మాణ కౌశలం ఒకరోజున అలవడేదికాదు. స్వతహాగా ఎంత తెలివైన ప్రొడ్యూసరు గానివ్వండి, డైరెక్టరు గానివ్వండి, అనుభవంమీదగాని మంచి చిత్రాలు నిర్మించలేడు. ఎప్పటి కప్పుడు కొత్త టెక్నీషియనుల తోనూ, కొత్త నటీనటులతోనూ, రచయితలతోనూ, కళా స్రష్టలతోనూ పనిచేసేవాడికి నిత్యాన్వేషణే తప్ప నికర మైన జ్ఞానార్జనలేదు. సమర్థుడిమాటే ఇట్లావుంటే ఇక అసమర్థుడిమాట చెప్పేదేమిటి? సమర్థుడు సృష్టించే తారలను రెట్టింపు ప్రతిఫలం ఇచ్చి అసమర్థుడు కొట్టుకుని పోతూండడంవల్ల తాను సృష్టించే తారద్వారా మరింత మంచి చిత్రంతీసి ఇటు చిత్రాలనూ అటు తారలనూ క్రమాభివృద్ధికి తీసుకువచ్చే అవకాశం సమర్థుడికి లేదు. ఆ తారను మరింత వృద్ధికితెచ్చే శక్తిగాని, సమర్థుడి కన్న మంచి చిత్రం తీసే శక్తిగాని అసమర్థుడి కెట్లాగోలేదు. ఉంటే తానే తారలను సృష్టించి ఉండును, అసమర్థు డనిపించుకోక పోను.

ఈ అసమర్థులు తీసే చిత్రాలు సగంలో ఆగిపోయి బయటికిరాని పక్షంలో పెట్టుబడిదారుకుతప్ప పరిశ్రమకు గాని ప్రజకుగాని ఏమంత అపకారం వుండదు, కాని ఈ తుక్కు చిత్రాలు విడుదలైన పిమ్మట వీటివల్ల దేశానికి అనర్థం చాలా వుంది. దేశంలో సినిమాసంస్థలు నెల కొల్పి కలకత్తాలో న్యూ థియేటర్సువారిలాగా ఒకతరగతికి చెందిన చిత్రాలుతీసే కంపెనీ లేని కారణంచేత విడుదల అయిన చిత్రాన్నిచూసి కొందరైనా దుఃఖపడేవరకూ చిత్రంతాలూకు మంచి చెడ్డలు ప్రజలకి తెలీవు. పబ్లిసిటీ అన్ని చిత్రాలకీ ఒకలాగే వుంటుంది. తారల పేర్లుగాని, డైరెక్టరు పేరుగాని, కవి పేరుగాని, సంగీతకళా దర్శకుల పేర్లుగాని, చిత్రం విలవ ఈషత్తయినా గ్యారంటీ ఇవ్వవు. అందుచేత చిత్రాలమీద ప్రజలకు విశ్వాసం ప్రేరేపించే పై లక్షణాలు లేవు. దీనికి తగ్గట్టుగానే అధిక సంఖ్యాకు లైన ప్రజలకి సినిమాహాలులు అందుబాటులో ఉండవు. అందుచేత అధిక సంఖ్యాకులైన ప్రజలు ఎంతో రూఢి చేసుకునిగాని చిత్రంయొక్క విలవను విశ్వసించరు. ఇది మంచితరగతి చిత్రాలకూ దెబ్బే.

మనదేశంలో బహుకొద్ది థియేటర్లున్నై. ప్రత్యేకించి ఆంధ్రంలో సినిమా థియేటర్ల సంఖ్య బహు తక్కువ. ఈ థియేటర్ల సంఖ్య కనీసం రెట్టింపయి పదివేల జన సంఖ్యగల ప్రతి బస్తీలోనూ ఒక థియేటరేర్పడితేనేగాని తెలుగు సినిమాలు నిర్మించటం వృథా అని మన ప్రొడ్యూ సర్లు చెబుతారు. కాని మన థియేటర్ల సమస్య హాలుల నిర్మాణంతో తేలేదికాదు.

యుద్ధకాలం మినహాయిస్తే మన తెలుగుదేశంలో విడుదల అయే తెలుగు చిత్రాలసంఖ్య ఏడాదికి పది పన్నెండు మించి వుండదు. ఇందులో ఏ ఒకటి రెండో ఏడెనిమిది వారాలు వెళ్లినా ఒకవారం, రెండువారాల కంటె వెళ్ళని చిత్రాలు అధికంగా ఉంటై. సినిమాహాలు కట్టినతరువాత అందులో ఏడాదిపొడుగునా చిత్రాలు ప్రదర్శించబడాలి. అట్లా ప్రదర్శించడానికి తగినన్ని చిత్రాలుండాలి. చిన్న చిన్న కేంద్రాలలో హిందీ, అరవ చిత్రాలుచూసే అవకాశం తక్కువ గనక అక్కడ సినిమాహాలు కట్టడం మరింత ఆపత్కరమైన విషయం. చిన్న కేంద్రాలలో పన్నెండు చిత్రాలను సంవత్సరం పొడుగునా ప్రదర్శించాలంటే అవి బెజవాడలాంటి కేంద్రంలో కనీసం మూడు నాలుగు నెలలు పోగల చిత్రాలై వుండాలి. ఈతరగతి చిత్రాలు ఏటా పన్నెండు తయారుచేయాలంటే ఇప్పటి పరిస్థితుల్లో, అనగా తెలుగు స్టూడియోలు లేకుండా, ఏడాదికి ఒకటికన్న తెలుగు చిత్రాలుతీసే సంస్థలు లేకుండా, సినిమా తారలకూ కథకులకూ తదితరులకూ ఒక నిలకడలేకుండా, అసంభవమని చెప్పాలి.

అరవ చిత్రాలు బహిష్కరించమనీ, హిందీ చిత్రాలు బహిష్కరించమనీ, అట్లాచేస్తే తెలుగుసినిమా పరిశ్రమ బాగుపడుతుందనీ చెప్పేవారున్నారు. వీరు థియేటర్ల

సమస్య ఆలోచించడంలేదు. తెలుగు చిత్రాలుతప్ప వెయ్యమని భీష్మించుకున్నట్టయితే ఉన్నథియేటర్ల సంఖ్య పెరక్కపోగా తగ్గుతుంది. థియేటర్ల సంఖ్య పెంచమని తెలుగుదేశంలోని పెట్టుబడిదార్లను ఉద్బోధించిన్నీ లాభంలేదు. ఉన్న థియేటర్లు పెరిగినట్టయితే హిందీ చిత్రాలూ, అరవ చిత్రాలూ చాలక ఇంగ్లీషు చిత్రాలుకూడా ఏదోకాడికి నడుపుకోవలిసి వస్తుంది. సినిమా చిత్రనిర్మాణ సంస్థలు థియేటర్లను చూసుకునే పుట్టలేదు. చిత్రనిర్మాణం అభివృద్ధి అయినకొద్దీ థియేటర్ల సంఖ్య తప్పనిసరిగా పెరుగుతుంది.

అనుభవంగాని ప్రతిభగాని లేకుండా చిత్రనిర్మాణంలో జూదంఆడడానికి ముందుకొచ్చే మూడోతరగతి ప్రొడ్యూసర్లకు, "మీరు చిత్రాలు తీయకండి," అని బోధించి లాభంలేదు. జూదగాళ్ళు హితబోధలు వినరు. సినిమా పరిశ్రమలోపనిచేస్తున్న తారలనుగాని తదితరులనుగాని, "మీరు డబ్బుకాశించి తుక్కు చిత్రాలలో పాల్గొనకండి." అని చెప్పి లాభంలేదు. ఒకవృత్తి పెట్టుకున్న మనిషికావృత్తిలో గిట్టుబాటు కాదగినంత కావటం న్యాయం. వారికి విడవకుండా పనిఇవ్వగల ప్రొడ్యూసర్లు లేనప్పుడు, ఏనాడు వారికి చలామణీ లేకుండా పోతుందో ఊహించరానప్పుడు, వారు డబ్బయినా చూసుకోక ఏంచేస్తారూ?

కనక ఈ పరిశ్రమకు ముక్తిరావాలంటే కేవలమూ హితబోధలవల్లరాదు. దానికి సహజమైన మార్గం ఒకటే వుంది. అది సంస్థల నిర్మాణంద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. అరడజను ఉత్తమతరగతి సినిమా నిర్మాణ సంస్థలు మనదేశంలో సులభంగా ఏర్పడవచ్చు. చిత్రనిర్మాణ సంస్థ నెలకొల్పడానికి 30 మొదలు 50 లక్షల రూపాయల పెట్టుబడి అవసరం. ప్రతిసంస్థా తన స్వంత స్టూడియోలో, స్వంత టెక్నీషియనులతో, స్వంత నటీనటవర్గంతో సంవత్సరానికి అధమం నాలుగు ఉత్తమ శిల్పంగల చిత్రాలూ, అనేక వైజ్ఞానిక, వార్తాచిత్రాలూ నిర్మించగలిగి ఉండాలి. సినిమాకు సంబంధించిన విద్యలలో అనేకమందికి శిక్షణ ఇవ్వడమూ, తారలను సృష్టించడమూ మొదలైనవి చెయ్యగలగాలి. బెజవాడలాంటి కేంద్రంలో అధమం మూడేసి నెలలు వెళ్ళగల చిత్రాలు ఏటా పన్నెండుకు తక్కువ కాకుండా తయారయినట్టయితే తెలుగుదేశంలో వున్న సినిమా థియేటర్ల సంఖ్య నాలుగింతలవుతుంది, కేంద్రాల సంఖ్య అధమం రెట్టింపవుతుంది. నామరూపాలు లేకుండావున్న కేంద్రాలలో సహితం చక్కని సినిమాథియేటర్లు ఏర్పాటు కాగలవు.

పారిశ్రామిక కృషియందు ఆసక్తీ వ్యాపారదక్షతా కలవాళ్లు చిత్రనిర్మాణంలోకిదిగి ఉత్తమ తరగతి సంస్థలు నిర్మిస్తేనేతప్ప దొంగ మార్కెటు లాభాలు తిన్నవారు ఈ పరిశ్రమలో తమ జూదాన్ని కట్టిపెట్టరు. ఏటా నిర్మాణమయే తెలుగు చిత్రాలమీద అయ్యే ఖర్చుచూస్తే అది ఒక ఉత్తమ తరగతి సంస్థకు సరిపోయే పెట్టుబడి అవుతుంది. కాని అటువంటి సంస్థ నాలుగు చిత్రాలు నిర్మించి వాటిమీద సంపాదించే డబ్బుగాని పరపతిగాని ప్రజోపకారం గాని ఇన్ని చిత్రాలూ కలిసినా సాధించలేకుండా ఉన్నాయి.

ఒకదానికంటె మరొకటి హీనంగా వెలువడుతున్న ఈ చిత్రాలు ప్రజల కళాభిరుచిని ఏమాత్రమూ పెంపొందించలేవు. వీటిద్వారా సినిమాకళ ఎటువంటి ప్రజాహితం గాని సాధించలేదు, ప్రజల జీవితాలను సమీపించనైనా లేదు. చిత్రనిర్మాణానికి ఉత్తమ సంస్థలు ఏర్పడ్డనాడే నిజమైన ప్రజాభిప్రాయానికికూడా విలువ ఏర్పడుతుంది. ఎందుచేతనంటే జూదగాడు ప్రజాద్రోహి. సాంఘికజీవనంలో పాల్గొనేవాడే ప్రజాభిప్రాయాన్ని ఏనాడైనా పాటిస్తాడు. నూటికి తొంభై చొప్పున లాభాలు తీస్తామనే ఆశతో, నూటికి యాభై మొదలు ఎనభైవరకూ వడ్డీ ఇచ్చి డబ్బు అప్పుతెచ్చేవాళ్ళూ, చిత్రంమాట ఏమయినా కమిషన్లమీద దక్కేదే చాలుననుకునేవాళ్ళూ పారిశ్రామికులుకారు, గౌరవనీయులైన బందిపోటు దొంగలు.

ఇతర పరిశ్రమలలోలాగే నూటికి ఆరువంతున గిట్టుబాటైతేచాలుననుకునే పారిశ్రామికులు సినిమారంగంలో ప్రవేశించి తగిన ప్రమాణంలో పెట్టుబడిచేసిన రోజున చిత్రం మీద వెచ్చించే ప్రతి ఏగానికీ విలువ చిత్రంలో కనిపించి తీరడమేకాక, చిత్రాల ఖరీదులుతగ్గి రాబడి హెచ్చుతుంది; చిత్రాలకు ప్రజాదరణ హెచ్చుతుంది; పరిశ్రమలో పనిచేసే పదిమందికీ ఇంత నిలకడా, అభివృద్ధీ కనిపిస్తుంది; ఎవరితోనూ చెప్పకుండానే చచ్చు ప్రొడ్యూసర్లు శలవుపుచ్చుకుంటారు. అనాడే మనకు సినిమా పరిశ్రమ ఏర్పడిన తృప్తికూడా దక్కుతుంది.

Source: Press Academy Website, Navodaya Patrika 1947

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan